
సాక్షి గుంటూరు

బుధవారం । 8 । జనవరి । 2025



పాఠశాలలో పల్నాడు కలెక్టర్ తనిఖీ

నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను మంగళవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 565.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన వ్యామజాల శివరామయ్య కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.

న్యూస్‌రీల్

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, డీఈఓ, ఎల్‌జీఎస్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తగు ధ్రువపత్రాలతో ఈనెల 7 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడ టౌన్–వికారాబాద్(07205) ప్రత్యేక రైలు ఈనెల 9న కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు. వికారాబాద్–శ్రీకాకుళం రోడ్డు(07207) ప్రత్యేక రైలు ఈనెల 10న సాయంత్రం ఐదు గంటలకు వికారాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07208) ప్రత్యేక రైలు ఈనెల 11న శ్రీకాకుళం రోడ్డు వద్ద మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి చర్లపల్లి స్టేషన్‌కు మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు చేరుకుంటుందని డీసీఎం పేర్కొన్నారు.

స్కౌట్స్‌తో దేశభక్తి, సేవాభావం పెంపు

జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందించేందుకు స్కౌట్స్, గైడ్స్ శిక్షణ దోహదం చేస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు బిగినర్స్ కోర్స్ ఫర్ స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ రేణుక మాట్లాడుతూ క్రమశిక్షణ, పరోపకారం, సోదరభావం పెంపొందించడంలో తోడ్పడుతుందని, ప్రతి పాఠశాలలో స్కౌట్స్ యూనిట్ చేయాలని సూచించారు. స్కౌట్స్, గైడ్స్ ఎస్‌ఓసీ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి చంద్రిక, ఎం.శ్రీహరి, పి.నరేష్ పాల్గొని శిక్షణ కల్పించారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ సీహెచ్ రమేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని ఎస్సీ వెల్ఫేర్ డీడీ డి.మధుసూదనరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈనెల 7వ తేదీతో గడువు ముగిసిందని చెప్పారు. దీంతో ప్రభుత్వం మరో ఐదురోజులు పొడిగించిందని వివరించారు. 12 వరకు స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని చెప్పారు. అనంతరం అన్ని తనిఖీలూ పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వివరించారు.

యార్డుకు 76,310 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 76,310 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 72,819 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 15,500 వరకు ధర పలికింది.

ప్రచురణ రంగం!

పుస్తక పఠనం మా'నేస్తమా'!

- ప్రతి పుట.. ఓ పాఠం..!
- పఠిస్తే నిత్య వికాసం
- సృజనకు చూపే మార్గం
- జీవితానికి అదే దారిదీపం
- ప్రజల ఆదరణ, ప్రభుత్వ సహకారం
- తోడైతేనే పూర్వవైభవం

'పుస్తకాలను ప్రేమించండి. అవి మీ జీవితాన్ని సుఖమయం చేస్తాయి. భావాల, ఉద్రేకాల, సంఘటనల, భయంకర గందరగోళంలో నుంచి బయటపడేసేందుకు మీకు అవి స్నేహపూర్వకమైన సలహాలనిస్తాయి. మిమ్మల్ని మీరు గౌరవించుకోవడం, పరులను గౌరవించడం నేర్పుతాయి. హృదయాన్ని, మేధస్సును, మనిషిపట్ల, ప్రపంచం పట్ల ప్రేమతో నింపివేస్తాయి'

– మాక్సిమ్ గోర్కీ

తెనాలి: పుస్తకం నిజంగా మనకు నేస్తం.. ఒకరకంగా అంతకుమించి.. 'పుస్తకాలు లేని గది ఆత్మ లేని శరీరం వంటిది' అన్నాడో పెద్దమనిషి. మనిషి సృజనాత్మకంగా జీవించాలంటే పుస్తకాలు ఉండాలి. ఏదైనా ఒక పుస్తకం చదివితే అందులోని పాత్రలు స్ఫూర్తినిస్తాయి. భావోద్వేగాలను అర్థం చేసుకునే పరిణితి సిద్ధిస్తుంది. వివిధ సందర్భాల్లో అవసరమైన నిర్ణయాలను తీసుకోవడానికి పుస్తక పఠనం ఖచ్చితంగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ఇంతటి ప్రాధాన్యం గల పుస్తక పఠనం నేడు తగ్గిపోతోంది. ఫలితంగా ప్రచురణ రంగం కుదేలవుతోంది. విజయవాడలో పుస్తక మహోత్సవం జరుగుతున్న సందర్భంగా పుస్తకావేదనకు అక్షర రూపం.



విజయవాడ పుస్తక మహోత్సవంలో సందర్శకులు

ఒకప్పుడు యమ క్రేజ్

ఒకప్పుడు చరిత్ర, సామాజిక పరిజ్ఞానం, కాల్పనిక సాహిత్య రచనలను పెద్దలు చదివేవారు. అపరాధ పరిశోధన నవలలైతే హాట్‌కేకులే! పెద్దలు చదువుతుంటే, పిల్లలు కూడా వాటిపై దృష్టి పెట్టేవారు. ఊరిలో ఉండే లైబ్రరీకి తరచూ వెళ్లటం, పుస్తకాలు ఇంటికి తెచ్చుకుని, చదవటం ఒక అలవాటు. విద్యాసంస్థల్లో పుస్తకాల లైబ్రరీ అందుబాటులో ఉండేది. దిన, వార, మాసపత్రికలతో సహా ప్రముఖ రచయితల రచనలన్నీ లైబ్రరీల్లో లభ్యమయ్యేవి. కాల్పనిక నవలలు, కథాసంకలనాలు, చరిత్ర రచనలు, ప్రసిద్ధుల జీవితచరిత్రలు, బాలసాహిత్యం చదివేవారు. పాపులర్ రచనలైతే ఆ డిమాండ్ వేరేగా ఉండేది. అప్పట్లో వచ్చే వారపత్రికలు, దినపత్రికల్లో సీరియల్‌గా వచ్చే నవలల కోసం పాఠకులు ఎదురుచూసేవారు. అన్నీ దాచుకుని, సీరియల్ అయిపోగానే చించి నవలగా బైండింగ్ చేయించుకునేవారు.

పుస్తకానికి గడ్డుకాలం

పుస్తకానికి గడ్డుకాలంతో ప్రచురణకర్తలు తగ్గిపోతున్నారు. విజయవాడకన్నా ముందే 1950ల్లో తెనాలి ప్రచురణ కేంద్రంగా విరాజిల్లింది. సుప్రసిద్ధ కవులు, రచయితలకు నిలయమైంది. అప్పట్లోనే ఇక్కడ్నుంచి వార, మాసపత్రికలు వచ్చాయి. ఆ తర్వాత ప్రచురణ కేంద్రంగా వర్ధిల్లిన విజయవాడలో ఒకప్పుడు 50కుపైగా ప్రచురణకర్తలుండేవారు. ప్రస్తుతం ఐదారుగురే ఉన్నారు. ప్రచురణకర్తలు గతంలో ఒక్కో పుస్తకాన్ని వెయ్యి కాపీలు ముద్రించేవారు. ఇప్పుడు ఏ పుస్తకమైనా 200లకు మించి మార్కెట్ ఉండటం లేదంటున్నారు.

అంతా 'గ్రంథ'రగోళమే !

ప్రభుత్వ గ్రంథాలయాలు నీరసించిపోవటం కూడా పుస్తక ప్రాభవం తగ్గటానికి కారణాల్లో ఒకటి. దక్షిణాది పొరుగు రాష్ట్రాల్లో రచయిత ముద్రించిన కాపీల్లో సగం ప్రభుత్వాలు కొనుగోలు చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రజల నుంచి వసూలుచేసే పన్నులో రూపాయికి 8 పైసలు స్థానికసంస్థలకు వెళుతున్నా, గ్రంథాలయాలకు ప్రభుత్వాలు ఏమీ చేయటంలేదు.

కాలం మారింది.. చదవడం తగ్గింది

రానురాను కాలం మారుతూ పుస్తకానికేసి చూడడం తగ్గిపోయింది. పిల్లలకు సామాజిక పరిజ్ఞానం, సాహిత్యంపై అభిలాష, చారిత్రక నేపథ్యంపై ఆసక్తిని కలిగించేలా పెద్దల జీవనశైలి ఉండటం లేదు. చిన్నతనం నుంచి పుస్తకాల్ని చదివించాల్సిన అవసరాన్ని గుర్తించటంలో ఇంటి నుంచి బడి వరకు అంతా విఫలమయ్యారు. కార్పొరేట్ పాఠశాలల రంగప్రవేశం, ర్యాంకుల వైకుంఠపాళీలో పిల్లలకు స్కూలు క్లాసులతోనే పొద్దుపోతోంది. కంప్యూటర్ సైన్స్ కోర్సులతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎక్కడచూసినా ఇంజినీరింగే. జనరల్ నాలెడ్జి, కరెంట్ ఎఫైర్స్ కోసం కూడా వీళ్లు దినపత్రికలు చూడ్డం లేదంటే అతిశయోక్తి కాదు. 'గూగుల్ తల్లి'నే అన్నీ అడుగుతున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులు పుస్తకానికి తీసుకొచ్చిన తంటా ఇది.

పుస్తక ప్రచురణ కష్టసాధ్యంగా ఉంది



పుస్తకాలు వెయ్యి కాపీలు వేసే ప్రొఫెషనల్ పబ్లిషింగ్ ఇప్పుడు లేదు. యూనికోడ్ వచ్చాక ఎవరికివారు తక్కువ కాపీలను డిజిటల్ ప్రింటింగ్ చేయిస్తున్నారు. పుస్తకాలను కొనక పోవటంతో వచ్చిన దుస్థితిది. సామాజికశాస్త్రాలు, రాజకీయ నేపథ్యం ఉన్న పుస్తకాలను అధ్యయనం కోసం కొంటున్నారు. చదివినా చదవకున్నా, ఆధ్యాత్మిక పుస్తకాలు పోతున్నాయి. దళిత సాహిత్యం బాగానే అమ్ముడవుతోంది.

– వెంకటనారాయణ, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ

ప్రభుత్వ సహకారం ఉంటేనే మనుగడ



ప్రభుత్వ సహకారం ఉంటేనే పుస్తకానికి మనుగడ. లైబ్రరీల ద్వారా పుస్తకాలు కొనుగోలు చేయించాలి. ఎప్పటికప్పుడు డబ్బులు విడుదల చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో లైబ్రరీలను ఏర్పాటుచేయాలి. వాటికీ పుస్తకాలు సరఫరా చేయాలి. వీటితోపాటు మూడేళ్లక్రితం కొనుగోలు చేసిన పుస్తకాలకు డబ్బులు వెంటనే విడుదల చేయాలి.

– బి.రవికుమార్, నవరత్న బుక్‌హౌస్, విజయవాడ

నవతరం దారి మళ్లింది



నవతరం పుస్తక పఠనం నుంచి దారిమళ్లింది. సంపాదనే ముఖ్యమైంది. మానవీయ విలువలపై అవగాహన లేకుండా పోయింది. గ్రంథాలయాలను ఆధునీకీకరించి, పుస్తకాలన్నీ అందుబాటులో ఉంచేలా చేసినపుడే మంచి రోజులొస్తాయి. మా ప్రయత్నం అందుకే.

– వల్లూరు శివప్రసాద్, కన్వీనర్, గ్రంథాలయాల పునర్వికాస ఉద్యమ వేదిక

రజక చెరువు వద్ద తీవ్ర ఉద్రిక్తత

- అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్న అధికారులు
- దళిత సంఘాల నేతలతో పోలీసుల చర్చలు



తెనాలిరూరల్: తెనాలి రజక చెరువు వద్ద మంగళవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును పోలీసులు, పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకోవడంతో వివాదం తలెత్తింది. రజక చెరువు కూడలిలో పాత పార్లమెంటు భవన ఆకారంలో చిన్నపాటి భవనాన్ని నిర్మించి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, మూడు రోడ్ల కూడలిగా మార్చేందుకు కొన్నేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. భారీ విగ్రహం ఏర్పాటు చేయాలని తలంచారు. అయితే ఆ తర్వాత పనులు ఆగిపోయాయి. తాజాగా మంగళవారం సాయంత్రం దిమ్మె నిర్మించి ప్రస్తుతానికి చిన్న విగ్రహం ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. దీంతో పనులు చేసేందుకు వీలు లేదని, స్టే ఉందంటూ పోలీసులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న మాలమహానాడు, దళిత సంఘాల నేతలు అక్కడకు చేరుకుని తమ వద్ద ఉన్న అనుమతి పత్రాలను చూపించారు. టౌన్ ప్లానింగ్ అఅధికారులు వచ్చి స్టే ఉందని చెప్పడంతో దళిత సంఘాల నాయకులు ఆర్డర్ కాపీ చూపాలని డిమాండ్ చేశారు. వారు ఎటువంటి ఆధారం చూపకపోవడంతో పనులను కొనసాగిస్తున్నారు. టూ టౌన్ సీఐ రాములు నాయక్ దళిత నేతలతో చర్చలు జరుపుతున్నారు. దళితులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో వన్‌టౌన్, త్రీ టౌన్ సీఐలు పెద్ద ఎత్తున తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

సాయం రంగు పులిమి..!

- బుడమేరు వరద బాధితుల పేరుతో రూ.కోట్ల ఖర్చు
- ఆహార సరఫరా సంస్థల పేరుతో కాకుండా ఎక్కువ శాతం వ్యక్తుల పేరుతోనే చెల్లింపులు
- పది రోజుల పాటు సరఫరా చేసినట్టు బిల్లులు
- ఒక్కో సంస్థకు రూ.లక్షల్లో చెల్లింపులు
- ఆ సంస్థలకు సామర్థ్యం ఉందా అన్నది అనుమానమే!
- ఏసీబీ, జీఎస్టీ కమిషనర్లకు ఫిర్యాదు చేయనున్న డెప్యూటీ మేయర్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: బుడమేరు సాయం పేరుతో గుంటూరు నగరపాలక సంస్థ చేసిన ఖర్చులపై అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. వరద వచ్చి తగ్గిపోయిన తర్వాత కూడా ఫుడ్‌ప్యాకెట్లు సరఫరా చేసినట్లు బిల్లులు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైఎస్సార్ సీపీతోపాటు కూటమి కార్పొరేటర్లు కూడా ఈ లెక్కలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమకు ఒక్క మాట కూడా చెప్పకుండా ఎవరికీ తెలియకుండా ఇంత పెద్ద మొత్తంలో గుంటూరు నుంచి ఫుడ్‌ప్యాకెట్లు ఎలా వెళ్లాయోనని కూటమి నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఈ చెల్లింపులు సంస్థల పేరుతో కాకుండా ఎక్కువభాగం వ్యక్తుల పేర్లతో చేయడం, ఒక్కో సంస్థకు రూ.లక్ష నుంచి కోటి రూపాయల వరకూ చెల్లింపులు జరపడం విస్మయం కలిగిస్తోంది. అసలు ఆ సంస్థలకు అంత సామర్థ్యం ఉందా అన్న కోణంలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. అన్నె తారక రమేష్ పేరుతో రూ.3,78,000, బి.పురుషోత్తమరావు పేరుతో 27,58,735, బి.రాఘవేంద్రరావు పేరుతో రూ.15,60,925, బి.సత్యనారాయణ పేరుతో రూ. 9,05,480, బి.సురేంద్ర పేరుతో రూ.20,37,025, బి.మురళీకృష్ణ పేరుతో రూ.45,35,250 ఇలా పలువురు వ్యక్తుల పేర్లతో లక్షలాది రూపాయల బిల్లులు చెల్లించినట్టు లెక్కలు కనిపిస్తున్నాయి.

ఆద్యంత గోప్యత ఎందుకో..!

వరద బాధితుల కోసం నిధుల కేటాయింపు, విడుదల, ఆహార ప్యాకెట్ల పంపిణీ ప్రక్రియలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసరావు ఆద్యంతం వ్యవహరించిన తీరు, పాటించిన గోప్యత, కొనుగోలు చేసిన విధానం అనుమానాస్పదంగా ఉంది. ఈ వ్యవహారంలో భారీ అవినీతి జరిగిందనే వాదనకు బలం చేకూరుస్తోంది. చెల్లింపులు జరిపిన ప్రక్రియలో, జీఎస్టీ చెల్లింపులలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. మొత్తం ఈ ప్రక్రియలో చోటు చేసుకున్న వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నగరపాలక సంస్థ కేటాయించిన నిధులలో ఎవరెవరికి ఏ ప్రాతిపదికన బిల్లులను చెల్లించారు? వారి అర్హతా ప్రమాణాలను అధికారులు పరిశీలించారా లేదా? బిల్లులు చెల్లింపులు చేస్తున్నటువంటి సంస్థలకు జీఎస్టీ లైసెన్సులు సక్రమంగా ఉన్నాయా? లేక లోపాయికారీ ఒప్పందాలతో చెల్లింపులు జరిపారా? సదరు బిల్లుల తాలూకా సొమ్మును పొందిన సంస్థలు ఆయా జీఎస్టీ శ్లాబుల ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ సొమ్మును చెల్లించాయా? లేక పన్ను ఎగవేతలకు పాల్పడ్డాయా.? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖతో పాటు, జీఎస్టీ కమిషనర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లకు బుధవారం గుంటూరు డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు ఫిర్యాదు చేయనున్నారు.

ధనుర్మాస గొబ్బిళ్ల ఉత్సవం



తెనాలి: ధనుర్మాసంలో గొబ్బిళ్ల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని పారడైజ్ గృహసముదాయంలో గొబ్బిళ్ల ఉత్సవం చేశారు. ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తిసంకీర్తన గాయని శారదా చలపతి బృందం ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. గొబ్బిళ్ల చుట్టూ పాటలు పాడారు. గొబ్బిళ్లను లక్ష్మి, గోపిక స్వరూపాలుగా పూజించారు. శారదా చలపతి మాట్లాడుతూ మన సంస్కృతిని చాటి చెప్పేందుకే వేడుక నిర్వహించినట్టు వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మహాలక్ష్మి, నాగమణి, వర్ధని, ఆదిలక్ష్మి, శ్రీదేవి, మౌనిక, శుభ, జ్యోతి, ఆదిలక్ష్మి, పద్మజ, సుశీల పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పోస్టుపోన్!

అంతా మా ఇష్టం

- ప్రమోషన్ పోస్టుల్లో పక్షపాతం
- ఏళ్లతరబడి కొన్ని భర్తీ చేయటం లేదు
- అధికారుల తీరుతో నష్టపోతున్న ఉద్యోగులు
- జీజీహెచ్ అధికారుల పనితీరుపై విమర్శలు



గుంటూరు జీజీహెచ్

గుంటూరు మెడికల్: అంతా మా ఇష్టం.. ఎడాపెడా ఏది చేసినా అడిగేదెవరు? అన్నట్లుగా గుంటూరు జీజీహెచ్ పరిపాలన అధికారులు వ్యవహరిస్తున్నారు. తమకు నచ్చకపోతే ఐదేళ్లుగా పోస్టు ఖాళీగా ఉన్నా ప్రమోషన్ ద్వారా భర్తీ చేయరు. తమకు నచ్చితే పోస్టు ఖాళీ ఏర్పడి పదిరోజులే అయినా నోటిఫికేషన్ ఇచ్చి ప్రమోషన్ ద్వారా భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తారు. ఆస్పత్రి అధికారుల పక్షపాత ధోరణితో సకాలంలో ప్రమోషన్లు రావటం లేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరేళ్లుగా జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ

గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఆరేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో కొన్నింటిని ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయినా ఆస్పత్రి అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారు. ప్రమోషన్ కోసం కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ ఇచ్చారు. మిగతావారికి ఉద్యోగోన్నతి ఇవ్వలేదు. దీంతో మిగతా సిబ్బందీ మళ్లీ కోర్టును ఆశ్రయించారు. సీఎంకు, కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఆస్పత్రి అధికారులు పోస్టుల భర్తీకి ఆసక్తి చూపడం లేదు.

2021 నుంచి రికార్డు అసిస్టెంట్ లేరు

ఆస్పత్రిలో రికార్డు అసిస్టెంట్ పోస్టు 2021 మే నుంచి ఖాళీగా ఉంది. ఆస్పత్రిలో పలువురు నాలుగో తరగతి ఉద్యోగులు ఈపోస్టుకు అర్హత కలిగి ఉన్నారు. ప్రమోషన్ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా అధికారులు కరుణించడం లేదు.

రెండు వారాల్లో భర్తీ !

ఆస్పత్రిలో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టుల జాప్యంపై అసిస్టెంట్ డైరెక్టర్ పాల్ సుధాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా రెండు వారాల్లో రికార్డు అసిస్టెంట్ పోస్టును, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు.

స్వప్రమోషన్ల కోసం పాకులాట

కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాల్సిన కార్యాలయ అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పోస్టుపోన్ చేస్తూ తమ ప్రమోషన్ల కోసం పదే పదే సెక్రటేరియట్ చుట్టూ, డీఎంఈ కార్యాలయం చుట్టూ తిరిగి సాధించుకుంటున్నారు. గత నాలుగేళ్లలో పలువురు సీనియర్ అసిస్టెంట్లు ఆఫీస్ సూపరింటెండెంట్లుగా, ఆఫీస్ సూపరింటెండెంట్లు పరిపాలనా అధికారులుగా, పరిపాలనా అధికారులు అసిస్టెంట్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు పొందారు. వారి ప్రమోషన్లకు లేని అభ్యంతరాలు కింది స్థాయి ఉద్యోగుల ఉన్నతికి మాత్రం ఎందుకొస్తున్నాయన్నది చిరుద్యోగుల ప్రశ్న. గత ఏడాది జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్ల పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి కూడా అభ్యంతరాల పేరుతో ఆసుపత్రి అధికారులు వాయిదా వేశారు. గత నెలలో ఆర్డీ కార్యాలయంలో ప్రమోషన్ల జాబితా పంపించే విషయంలో జీజీహెచ్ కార్యాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరోపణలు రావడంతో చార్జి మెమోలు జారీ అయ్యాయి. అయినా వారిలో మార్పులేదు. కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.నాగలక్ష్మి ఈ విషయంపై దృష్టి సారించి ప్రమోషన్లు ఇవ్వాలని చిరు ఉద్యోగులు కోరుతున్నారు.

10న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపు

- లాయర్‌పై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలి
- జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పొన్నూరు టౌన్ పీఎస్ సీఐ, ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు జరిపిన అమానుష దాడిని న్యాయవాదులు ఖండించారు. ఈ మేరకు జిల్లా బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాది ప్రకాశరావుపై నమోదైన కేసులు తొలగించాలని, సీఐ, ఎస్‌ఐలపై వెంటనే చర్యలు చేపట్టాలంటూ న్యాయవాదులు నినాదాలు చేశారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వారం రోజులపాటు న్యాయవాదులు విధులను బహిష్కరించి, ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నారని పేర్కొన్నారు. సీఐ, ఎస్‌ఐలను వెంటనే సస్పెండ్ చేసి, అరెస్ట్ చేయాలన్నారు. న్యాయవాదిపై నమోదు చేసిన అక్రమ కేసులను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. వారం రోజులలోగా న్యాయవాదికి న్యాయం చేయాలని అన్నారు. లేనిచో తప్పనిసరిగా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, న్యాయవాదికి న్యాయం చేసేవరకు ఉద్యమిస్తామని చెప్పారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించేందుకు న్యాయవాదులు కంకణం కట్టుకోవాలని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. దాడిలో పాల్గొన్న వైద్యునిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ మాజీ అధ్యక్షులు శాంతకుమార్, సురేష్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కార్య దర్శి అనురాధ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు క్రాంతికుమార్, న్యాయవాదులు సత్యం, చల్లా క్రాంతికుమార్, నాగేశ్వరరావు, షేక్.అజీజుద్దీన్, టి.ఆనంద్‌బాబు, షేక్.సుభాని, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీలో పసికందు మృతదేహం



తాడేపల్లిరూరల్: కొలనుకొండలో దారుణం జరిగింది. గంగాలమ్మ గుడి సమీపంలో డ్రైయినేజీలో మంగళవారం మగ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మురుగునీటిలో శిశువు పడి ఉండడాన్ని పోలీసులు వచ్చేదాక చూడలేని ఓ మహిళ బయటకు తీసి ఒడిలో పెట్టుకుంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు పసికందు మరణించినట్టు గుర్తించి వీఆర్వో తులసి సాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు ఎవరైనా పడేసి ఉంటారా అని అనుమానిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. శిశువు చనిపోతే కాలువలో పడవేశారా లేదా కాలువలో పడవేసిన తరువాత శిశువు మృతి చెందిందా అనేది పోస్టుమార్టం తర్వాత నిర్ధారణవుతుందని సీఐ కళ్యాణరాజు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,600** గరిష్ఠం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,900**

క్లుప్తంగా

పోషణ్ బీ పఢాయిపై శిక్షణ

నెహ్రూనగర్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. పోషణ్ భీ పడాయి కార్యక్రమంపై గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన సూపర్‌వైజర్స్, సీడీపీఓలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణ, తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలను గురించి, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పోషకాహారం, సమతుల్యత ఆహారం యొక్క ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎన్‌ఆర్‌సీ(న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీ సాయి విద్యా మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల లోపాలను గుర్తించి వారిని సమీప ఎన్‌ఆర్‌సీ సెంటర్‌కు రిఫర్ చేయాలన్నారు. జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత, న్యూట్రీషన్ కౌన్సిల్ లక్ష్మీ నరసమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు

కొరిటెపాడు (గుంటూరు): సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి డి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించడానికి విక్రయాలు పెరిగేలా ఈ తగ్గింపు అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించారు. మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చేనేత చీరలు, బెడ్‌షీట్స్, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అన్ని ఆప్కో విక్రయ శాలలతో పాటు ఆప్కో హ్యాండ్లూమ్స్.కామ్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల వెబ్‌సైట్‌లో కొనుగోలు చేసి చేనేత పరిశ్రమకు చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హుబ్లీ-వాస్కో రైలు తాత్కాలిక రద్దు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పలు అభివృద్ధి పనుల దృష్ట్యా షాలీమార్-వాస్కోడిగామా(18047) ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 16 నుంచి ఏప్రిల్ 15 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రయాణికులు గమనించగలరని వివరించారు. పూర్తి వివరాలకు సమీప రైల్వేస్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ యువజన ఉత్సవాలకు ఏఎన్‌యూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు, వర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులు మార్చి 5న నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో జరిగే జాతీయ యువజన ఉత్సవ పోటీల్లో పాల్గొననున్నట్లు యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధర రావు తెలిపారు. డిసెంబర్ 26 నుంచి 30వ తేదీవరకు చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ యువజన ఉత్సవాల పోటీల్లో విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆరు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం వీసీ విద్యార్థులను అభినందించారు. యువజనోత్సవాల కో-ఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, డాక్టర్ రమీ బేగంలను అభినందించారు. యువజన ఉత్సవాల్లో వర్సిటీ విద్యార్థులు స్పాట్ ఫొటోగ్రఫీ, మెహందీ, మైమ్, ఇన్‌స్టాలేషన్, కార్టూనింగ్ విభాగాల్లో పతకాలు సాధించినట్లు యువజన ఉత్సవాల కో-ఆర్డినేటర్ మురళీమోహన్ తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను వీసీ ఆచార్య కె.గంగాధర రావు, రెక్టర్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు అందజేశారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన..

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగంలో ఈసీసీహెచ్‌ఓ ఓవర్సీస్ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమీలారాణి పాల్గొన్నారు. ఈసీసీహెచ్‌ఓ ఓవర్సీస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమోతు రమేష్ విద్యార్థులకు యూకే, యుఎస్‌ఏ, ఐర్లాండ్ దేశాల్లో ఉన్న ఉన్నత విద్యా అవకాశాలు, అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. విదేశాల్లో చదవడం ద్వారా కెరీర్‌ను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశాలపై విద్యార్థులకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమీలారాణి, రేణు కాదేవి పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగం ఆధ్వర్యంలో మార్చి 6, 7 తేదీల్లో నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఎడ్యుకేషనల్ పర్‌స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేటర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మాజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు వచ్చిన పరిశోధన పత్రాలు పరిశీలించి పబ్లికేషన్ తీసుకొస్తామని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ సందర్భంగా రెక్టర్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యావిభాగం బీఓఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శివలక్ష్మి, అతిథి అధ్యాపకులు డాక్టర్ సందీప్, డాక్టర్ వసంతరావు, డాక్టర్ శివరామిరెడ్డి, పరిశోధకులు ఆలీ భాష తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి సంక్రాంతి సంబరాలు



సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీవరకు అంగరంగ వైభవంగా, తెలుగు సంప్రదాయాలను నేటితరానికి తెలియచేసేలా ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో నగర ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంస్థల సహకారంతో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో 4 రోజుల పాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు మంగళవారం సాయంత్రం నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, ఏసీ చల్లా ఓబులేసు, డీసీ డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ – ఎన్‌ఐపీహెచ్‌ఎం మధ్య అవగాహన



ఎన్‌ఐపీహెచ్‌ఎం డీజీ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, జేడీ డాక్టర్ విధు కేపీలతో పత్రాలను మార్చుకుంటున్న విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ – హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐపీహెచ్‌ఎం)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ విధు కేపీలతో ఒప్పందానికి సంబంధించిన అవగాహన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఎన్‌ఈపీ-2020లో పొందుపరిచిన మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ (ఎంఈఆర్‌యు) కాన్సెప్ట్‌ను, అకడమిక్ ప్రోగ్రామ్స్‌ను, కరిక్యులమ్ డిజైన్‌ను చేస్తామన్నారు. అంతేకాకుండా ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రామ్, హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్, పేటెంట్స్, ప్రాజెక్టులు, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చునన్నారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. అంతేకాకుండా ఎన్‌ఐపీహెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మాస్టర్స్, పీహెచ్‌డీలు పూర్తి చేయడానికి కావలసిన సహకారాన్ని అందిస్తామన్నారు. ఎన్‌ఐపీహెచ్‌ఎం డీజీ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్ మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలపై పట్టు సాధిస్తేనే విజయం



కపోతాలను ఎగురవేస్తున్న వడ్లమాని రాజ్యలక్ష్మి, బాలగంగాధర్ రెడ్డి



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పిడుగురాళ్ల రూరల్: విద్యార్థి దశలో ఏ క్రీడను ఎంచుకున్నా దానిపై పట్టు సాధిస్తేనే విజయం సాధ్యమని రోటరీ జిల్లా మాజీ గవర్నర్ వడ్లమాని రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని గీతికా సీబీఎస్‌సీ స్కూల్‌లో జిల్లా స్థాయి రోటరీ ఇంట్రాక్ట్ స్పోర్ట్స్ మీట్ మంగళవారం నిర్వహించారు. 15 మండలాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, త్రోబాల్ వంటి గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... గెలుపోటములు సహజమని, ఓడిపోయినా పాఠాలు నేర్చుకొని విజయానికి కృషి చేయాలని అన్నారు. స్కూల్ చైర్మన్ బాలగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యతోపాటు క్రీడలలో నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డైరెక్టర్ వెంకట రామిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్ట్ ఉద్యోగాలకు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ఫార్మసిస్ట్ పోస్టుల కోసం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన డి.ఫార్మసీ విద్యార్థులను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నెహ్రూనగర్ నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న సివిల్ సప్లయి అధికారులు, పోలీసులు దాడిచేసి కొల్లిపర సువర్చల, ఆమె భర్త కొల్లిపర సుబ్బారావులను అదుపులోకి తీసుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకుని, ఆటో డ్రైవర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేశారు. 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. డెప్యూటీ తహసిల్దారు భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వక కలయిక



పట్నంబజారు: రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కార్యాలయంలో కలిసి.. శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ మహిళా నేతలు ఆమెతో ఉన్నారు.

దేశానికి గర్వకారణంగా నిలిచిన కోనేరు హంపి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ మహిళా ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ సాధించిన కోనేరు హంపి దేశానికే గర్వకారణంగా నిలిచారని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి మండలం కొలనుకొండలోని కోనేరు హంపి నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరెన్నో అంతర్జాతీయ పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కాటన్ అడ్వైజర్ బోర్డు మాజీ సభ్యుడు అత్తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సిమ్లాలో శిక్షణకు ఆంధ్ర ముస్లిం కళాశాల విద్యార్థి



గుంటూరు ఎడ్యుకేషన్: ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనే లక్ష్యంతో 100 కిలోమీటర్ల అల్ట్రారన్ శిక్షణ కోసం సిమ్లాలో జరిగే శిక్షణకు వెళుతున్న ఆంధ్ర ముస్లిం కళాశాల డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థి షేక్ సుభానీని కళాశాల కరస్పాండెంట్ షేక్ సుభానీ మంగళవారం అభినందించారు. పొన్నూరురోడ్డులోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సుభానీ మాట్లాడుతూ దేశానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకువచ్చే క్రీడాకారులకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థికి రూ.10వేలు అందజేశారు. మహ్మదీయ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు షేక్ రెహ్మాన్, సలహాదారుడు డాక్టర్ ఎండీ మస్తాన్‌వలీ, ప్రిన్సిపాల్ షేక్ షాహీనా బేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కులగణనపై సవరణల అర్జీలకు గడువు పెంపు

నెహ్రూనగర్: ఎస్సీ కులగణన జాబితాలో సవరణలకు మంగళవారం ఆఖరిరోజు అని గతంలో ప్రకటించామని, ప్రజలకు మరింత గడువు ఇచ్చేందుకు ప్రభుత్వం జనవరి 12 వరకు పొడిగించిందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పూర్తయిన కుల గణన జాబితాలను 2024 డిసెంబర్ 26న నగరంలోని 206 వార్డ్ సచివాలయాల నోటీసు బోర్డుల్లో సందర్శనార్థం ఉంచామన్నారు. నగర ప్రజలు సర్వే రిపోర్ట్ లోని తమ వివరాలు సరిగా ఉన్నాయో, లేదో చెక్ చేసుకోవచ్చని సూచించారు. పేర్లు, సబ్ కేటగిరీ వివరాలు తప్పుగా ఉన్నా, ఏమైనా అభ్యంతరాలు ఉన్నా జనవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్థానిక సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శి, వీఆర్‌ఓలకు లిఖిత పూర్వకంగా అర్జీలు అందించవచ్చని తెలిపారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో విచారించి, విచారణ మేరకు తుది జాబితాలో నమోదు చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీహనుమాన్ చాలీసా



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణ మండపం వేదికపై మంగళవారం సర్వకార్య జయం హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలక మండలి సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. విశేష హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. చిలకలూరిపేట ఈవూరిపాలెం భజన బృందం భక్తి శ్రద్ధలతో పారాయణ చేశారు. బృందావన శ్రీనివాసునికి 108 సువర్ణ అష్టదళ పద్మాల పూజ ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి బృందం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీహరి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, సూర్యదేవర వెంకటేశ్వర్లు, పుట్టా ప్రభాకర్, పాలకవర్గం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ అభిషేకం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీకంచి కామకోటిపీఠ మారుతీ దేవాలయం ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం పూజలు మంగళవారం నాలుగో రోజుకి చేరాయి. మిత్ర క్యాలెండర్ సౌజన్యంతో శ్రీసీతా రామచంద్రస్వామి వారికి అభిషేకం నిర్వహించారు. శ్రీమద్రామాయణ పారాయణులు ఉదయం పారంభమై, సాయంత్రం వరకు కొనసాగాయి. రామాయణంలో పలు కాండలకు హోమం నిర్వహించారు. నీరాజన మహా మంత్రపుష్పాలు చేపట్టి, స్వామి వారికి దర్బారుసేవ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించగా, శ్రీరామ సేవా సమితి (వారణాసి) ఆధ్వర్యంలో జరిగాయి.

మాంటిస్సోరిలో ముగ్గుల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థుల తల్లుల ఎంతో ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

లక్ష్మీపురం: తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోని పిల్లలు ఆస్తి హక్కుకు అర్హులు కారని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం స్వాగతించదగినదని విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన చర్చ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి తీర్పు రావడం ముదావహమన్నారు. సీనియర్ సిటిజన్స్ వెంకటరత్నం, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డిలు మాట్లాడారు.

బీమా సంస్థలను కేంద్రం నియంత్రించాలి

లక్ష్మీపురం: హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను విక్రయించేటప్పుడు ఆయా కంపెనీలకు ఉండే ఆసక్తి, వేగం క్లయిమ్‌ల పరిష్కారంలో లోపిస్తుందని, బీమా క్లయిమ్‌లను వీలైనంత వేగంగా, పూర్తిగా పరిష్కారం అయ్యేలా ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలని వినియోగదారుల సంఘం కార్యదర్శి ముప్పాళ్ళ ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో బీమా సంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణ' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు పాల్గొన్నారు.

వీవీఐటీలో ఇంధన రంగంలో అవకాశాలపై సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ ధిన్నే గిరిధర్ కుమార్

పెదకాకాని: పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలని ఎనర్జీ ఇండస్ట్రియల్ టర్బో మిషనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ దిన్నే గిరిధర్‌కుమార్ పేర్కొన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీలో మంగళవారం ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్- ఇంధన రంగంలో అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా డాక్టర్ గిరిధర్ కుమార్ దిన్నే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పురోగమనాలు, ప్రపంచ పర్యావరణ ఆందోళన కారణంగా ఇంధన రంగం గణనీయమైన మార్పులకు లోనవుతుందన్నారు. ఫలితంగా ఇంధన పరిశ్రమలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు.గ్యాస్ టర్బైన్ వ్యవస్థ నిర్వహణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీస్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

17న రైతు ధర్నాను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య

తాడేపల్లిరూరల్: ఈనెల 17వ తేదీ విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేబీ భవన్‌లో రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని రైతు సంఘం అధ్యక్షులు జొన్న శివశంకరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వి.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, జిల్లా కార్యదర్శి కంచుమాటి జయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

లక్ష్మీపురం: గత 50 సంవత్సరాల నుంచి అనేక విభాగాలలో ప్రజలకు సేవలు అందిస్తున్న స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం లాంటి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినటువంటి పథకాలలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నటువంటి స్కీమ్ వర్కర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వారిని తక్షణమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష సాధింపులు అరికట్టాలని, విధులలో మరణించిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ, కొల్లి రంగారెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్వరూప రాణి, భూషణ కుమారి, ఉదయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సమాచారదర్శిని ఆవిష్కరణ



జీజీహెచ్ సమాచార దర్శిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులు ఇబ్బందులు పడకుండా ఏవార్డులో ఏ వైద్య సేవలు అందిస్తారు, ఏ స్పెషాలిటీ వైద్య సేవలు ఏ రోజు లభిస్తాయి, ఇతర ఆసుపత్రి సమాచారం అంతా అరచేతిలో ఉండేలా నూతనంగా సమాచార దర్శిని పుస్తకాన్ని రూపొందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ ఈపుస్తకాన్ని తయారు చేసి మంగళవారం సాహో జీజీహెచ్ సమాచార దర్శిని పేరుతో ఆవిష్కరించారు. రోగులకు, సాధారణ ప్రజలకు ఆసుపత్రికి సంబంధించిన అన్ని విషయాలు అర్థమయ్యే విధంగా వారి చేతిలోనే పుస్తకం ఉండటం ద్వారా సులువుగా తెలుసుకునే విధంగా సమాచార దర్శినిని రూపొందించినట్లు డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో జింఖానా (అమెరికా) ప్రెసిడెంట్ డాక్టర్ కోటా రామకోటేశ్వరరావు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ చిన్నం సుధారాణి, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.